సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 16 । ఏప్రిల్ । 2023



ఉయ్యాలే ఉరి తాడై..

ఉయ్యాల ఉరితాడై షేక్ తాహిరా అనే చిన్నారి ప్రాణం తీసింది.ఈ సంఘటన కురబలకోట మండలం నందిరెడ్డిగారిపల్లెలో శనివారం చోటుచేసుకుంది. - 8లో



ముగిసిన పది.. కొత్త ఉత్సాహంతో మది

జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పదో తరగతి పరీక్షలు ముగిశాయి జిల్లాలో 123 కేంద్రాల్లో 22,395 మంది పరీక్షలు రాశారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.74	రూ.90
రెండోరకం	రూ.50	రూ.72

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 196 మెట్రిక్ టన్నులు



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది (సా॥)	సహర్ సోమ (ఉ॥)
రాజంపేట	6.33	4.41
రాయచోటి	6.31	4.34
మదనపల్లి	6.35	4.40
పీలేరు	6.31	4.35

ఉద్యోగ మేళా.. భళా





జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు మేడా, కొరముట్ల, జెడ్పీచైర్మన్ ఆకేపాటి, కలెక్టర్ గిరీషా తదితరులు, ఉద్యోగాలకు ఎంపికైన వారికి అపాయింట్‌మెంట్ లెటర్స్ అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

- రాజంపేటలో మెగా జాబ్‌మేళా

రాజంపేట : రాజంపేట ఏఐటీఎస్‌లో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలకు విశేషస్పందన లభించింది. రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో ఉన్నటువంటి నిరుద్యోగులు హాజరయ్యారు. జాబ్‌మేళాలను ఎంపీ మిథున్‌రెడ్డి, కలెక్టరు గిరీషా ప్రారంభించారు. ఎమ్మెల్యేలు మేడా మల్లికార్జునరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, జిల్లా ఎస్పీ గంగాధరరావు, అమెరికా ఏపీ ప్రభుత్వ ప్రతినిధి రత్నాకర్, ఏఐటీఎస్ అధినేత చొప్పాగంగిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనువాసులరెడ్డి, నందలూరు ఎంపీపీ మేడావి జయభాస్కర్‌రెడ్డి, జేసీ అహ్మద్‌ఖాన్, డీసీఎంఎస్ చైర్మన్ దండుచంద్రలీలా గోపి పాల్గొన్నారు. జాబ్ మేళాలలో 5200 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. 2500 మంది ఉద్యోగాలు దక్కించుకున్నారు.

జాబ్‌మేళా నిరంతర ప్రక్రియ

యువతకు మెరుగైన జీవితం కల్పించాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమని ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. జాబ్‌మేళా నిరంతర ప్రక్రియన్నారు. ప్రతి వ్యక్తి నిరుద్యోగిగా మిగలకూడదు అనేది సీఎం లక్ష్యమన్నారు. జాబ్‌మేళాకు వచ్చిన యువతీ యువకులు ఏదో ఒక ఉద్యోగాన్ని మొదలు పెట్టడం వల్ల ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు. – ఎంపీ మిథున్‌రెడ్డి

నిరుద్యోగ సమస్య నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

నిరుద్యోగ సమస్య నిర్మూలనకు ప్రభుత్వం కృషిచేస్తోందని జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా నైపుణ్యాభివృద్ధి సంస్థను తీసుకొచ్చారన్నారు. ఫలితంగా నేడు లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించారన్నారు. – జెడ్పీ చైర్మన్,ఆకేపాటి

ఉద్యోగాలు ఇవ్వడంలో రాష్ట్రంలోనే ముందంజ

ఉద్యోగాలు ఇవ్వడంలో రాష్ట్రంలోనే అన్నమయ్య జిల్లా ముందంజలో ఉందని జిల్లా కలెక్టరు అన్నారు. మెగాజాబ్‌మేళాలు తొలుత తంబళ్లపల్లె, మదనపల్లె, రాయచోటి, ఇప్పుడు రాజంపేటలో నిర్వహించారన్నారు. – కలెక్టర్ గిరీషా

లక్ష్యసాధనకు కష్టపడాలి

యువత లక్ష్యసాధనకు కష్టపడాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. నిరుద్యోగ సమస్య నిర్మూలనలో భాగంగా ముఖ్యమంత్రి అనేక కార్యక్రమాలను తీసుకొచ్చారన్నారు. వీటిని నిరుద్యోగయువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. – ఎమ్మెల్యే మేడా

లక్ష్యాన్ని సాధించాలి

కసి, తపనతో లక్ష్యాన్ని సాధించేందుకు యువత కృషి చేయాలని అని రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. ఉద్యోగం చిన్నదా, పెద్దదా అనే తేడా లేకుండా పనిచేయాలన్నారు. భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు లభిస్తాయన్నారు. – ఎమ్మెల్యే కొరముట్ల

నిరుద్యోగులకు మెగాజాబ్‌మేళా వరం

నిరుద్యోగులకు మెగాజాబ్‌మేళా వరంలాంటిందని జిల్లా ఎస్పీ గంగాధరరావు అన్నారు. అభ్యర్థులు ఇంటర్వ్యూలలో నిర్భయంగా సమాధానాలు చెప్పి, ఉద్యోగాన్ని కైవసం చేసుకోవాలన్నారు. – గంగాధరరావు,జిల్లా ఎస్పీ

న్యూస్‌రీల్

వైవీయూలో నృత్య, సంగీత కోర్సుల్లో ప్రవేశాలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతం, కీబోర్డు సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైవీయూ ప్రవేశాల సంచాలకులు ఆచార్య కంకణాల గంగయ్య తెలిపారు. ఇతర వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. యోగివేమనయూనివర్సిటీ. ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు. ఈనెల 19 నుంచి 29వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాధితులకు సత్వరమే న్యాయం జరగాలి



మహిళా పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ గంగాధరరావు

రాజంపేట: పోలీసుస్టేషన్లకు వచ్చే బాధితులకు సత్వరమే న్యాయం జరగాలని జిల్లా ఎస్పీ గంగాధరరావు అన్నారు. శనివారం నియోజకవర్గ కేంద్రంలోని రాజంపేట రూరల్, టౌన్ పోలీసుస్టేషన్లకు ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే వారితో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. పోలీసుస్టేషన్లకు సంబంధించి రికార్డుల విషయంలో అప్‌డేట్‌గా ఉండాలన్నారు. స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. ఈయన వెంట డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, సీఐలు నరసింహారావు, పుల్లయ్య, ఎస్ఐ భక్తవత్సలం, ప్రసాద్‌రెడ్డిలు ఉన్నారు.

17నుంచి పాలిసెట్‌కు శిక్షణ

కడప ఎడ్యుకేషన్ : కడప శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 17వ తేదీ నుంచి పాలిసెట్ ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్లు జిల్లా పాలిసెట్ కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి తెలిపారు. కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగాలు ఉన్నాయన్నారు. పాలిసెట్ పరీక్ష ద్వారా ఈ విభాగాల్లో ప్రవేశాలు కౌన్సిలింగ్ ద్వారా జరుగుతాయన్నారు.

రక్తదాన సేవలకు పురస్కారం



మాజీ క్రికెట్ బ్రెట్‌లీ నుంచి పురస్కారం అందుకుంటున్న తారిఖ్ అలీ

కడప స్పోర్ట్స్ : కడపకు చెందిన 'ఖాన్ కా రిస్తా'స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు తారిఖ్ అలీ చేస్తున్న స్వచ్ఛంద రక్తదాన సేవా కార్యక్రమాలకు పురస్కారం దక్కింది. శనివారం ముంబైలో జరిగిన కార్యక్రమంలో ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ బ్రెట్‌లీ ముఖ్యఅతిథిగా విచ్చేసి 'ఇండియా బ్రాండ్ ఐకాన్ సర్వీస్ ఎక్సలెన్స్ బ్లడ్ డొనేషన్ ఇన్షియేటివ్ అవార్డ్ ఫర్ ఇయర్ 2022'అవార్డును తారిఖ్ అలీకి అందజేశారు. తారిఖ్ అలీ 2015లో ఖాన్ కా రిస్తా చారిటబుల్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా ను స్థాపించి ఎనిమిదేళ్లుగా రక్తదాన కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నారు.

రవికుమార్‌కు అవార్డు ప్రదానం



అవార్డు స్వీకరిస్తున్న రవికుమార్

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దళిత వర్గాల అభివృద్ధి సంఘం నిర్వాహకుడు పీఎం రవికుమార్‌బాబుకు శనివారం న్యూఢిల్లీలో జాతీయ బుద్ధ సంఘ్ అంబేడ్కర్ రత్న అవార్డును ప్రదానం చేసింది.ఈమేరకు రవికుమార్ సమాచారం అందజేశారు. శనివారం ఢిల్లీలోని పాలికా కేంద్రంలోగల ఎన్‌డీఎంసీ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రత్యేక సభకు కేంద్ర ఉక్కు గనులశాఖ మంత్రి ఫజ్జన్‌సింగ్ ఈ అవార్డును అందజేశారు.

దేవుడా.. దయ కలగలేదా !

- కన్నీరొలికినకొత్తపల్లె, వడిగలవారిపల్లె
- ఆర్తనాదాల మధ్య అవ్వ, మనవడి అంత్యక్రియలు

బి.కొత్తకోట : దేవుడా మాపై దయ కలగలేదా..ఏ పాపం చేశామని మాకీ శిక్ష..బిడ్డల బతుకులను చిదిమేశావా అంటూ తల్లిని, తండ్రిని కోల్పోయిన పిల్లలు రోదిస్తుంటే..భర్త లేక బిడ్డలను పోషించుకొంటున్న ఓ తల్లి కుమారుడిని, అత్తను పోగొట్టుకొని విలపిస్తుంటే గ్రామస్తులు కన్నీటిపర్యంతమయ్యారు. కానుగమాకులపల్లె ఘటనలో మృతి చెందిన నలుగురికి శనివారం రెండుచోట్ల ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించారు. బి.కొత్తకోట మండలం కొత్తపల్లెకు చెందిన అవ్వ చిన్న లక్ష్మమ్మ (75), మనవడు విజయ్ ప్రశాంత్ (23), వడిగలవారిపల్లెకు చెందిన శాంతి కుమారి (53), లక్ష్మణ (53)ల మృుతదేహాలకు మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తికావడంతో స్వగ్రామాలకు తరలించారు.



శాంతికుమారి, లక్ష్మణ మృతదేహాలను అంత్యక్రియలకు తీసుకెళ్తున్న బంధువులు, గ్రామస్తులు

తండ్రి, భర్త సమాధుల పక్కనే

కొత్తపల్లెకు చెందిన చిన్న లక్ష్మమ్మ, విజయ్ ప్రశాంత్ మృతదేహాలు మదనపల్లె నుంచి తీసుకురాగానే అంత్యక్రియలు నిర్వహించారు. చిన్న లక్ష్మమ్మ భర్త లక్ష్మన్న, కుమారుడు రామమోహన్ సమాధుల వద్దే వీరి అంత్యక్రియలు జరిగాయి. ఈ కుటుంబంలో ముగ్గురు చనిపోగా ఇప్పుడు తల్లి సరళ, పెద్ద కొడుకు జయప్రకాష్ మాత్రమే మిగిలారు.

ఒకేచోటు నుంచే రెండు పాడెలు

వడిగలవారిపల్లెకు చెందిన శాంతికుమారి, లక్ష్మణలు వదిన, మరిది అవుతారు. మదనపల్లె నుంచి వీరి మృతదేహాలు గ్రామానికి తరలించగానే పెద్దసంఖ్యలో గ్రామస్తులు, బంధువులు తరలివచ్చారు. ఈ ఇద్దరి ఇళ్లు పక్కపక్కనే ఉంటాయి. ఇద్దరికి ఇద్దరేసి సంతానం.ఎవరికీ వివాహాలు కాలేదు. లక్ష్మణ పిల్లల పెళ్లి ప్రయత్నాల్లోనే కడతేరిపోవడంతో సన్నిహితులు ఈ విషయం తలచుకుంటూ విలపించారు. ఇళ్ల నుంచి ఇద్దరి పాడెలను ఒకేసారి ఎత్తడంతో గ్రామస్తులు తరలివచ్చారు.

కాపాడే ప్రయత్నాల్లో మరణాలు: ఎంపీ, ఎమ్మెల్యే

కానుగమాకులపల్లె ఘటనపై ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈ ఘటన దురదృష్టకరమని అన్నారు. ఒకరినొకరు కాపాడే ప్రయత్నాల్లో షాక్‌కు గురై మృతి చెందారని అన్నారు. ప్రమాదానికి సంబంధించి సాంకేతిక సమస్య ఉందా, లేక మానవ తప్పిదాలు ఉన్నాయా అన్నదానిపై ఉన్నతాధికారులు విచారిస్తారని చెప్పారు.

రెండేళ్ల తర్వాత ఘోర ఘటన

2021 ఫిబ్రవరి 14న బి.కొత్తకోట మండలం తుమ్మణంగుట్టకు చెందిన ఎస్.దస్తగిరి కుటుంబం అజ్మీర్ దర్గా సందర్శనకు వెళ్తూ కర్నూలుజిల్లాలో ప్రమాదానికి గురయ్యారు. దస్తగిరి, ఎస్.అమ్మాజాన్ (35) భార్యభర్తలు. వీరి సంతానం సమీరున్ 10వ తరగతి, అమీరున్ 9వ తరగతి చదువుతుండగా, మూడో కుమారుడు ఖాసీఫ్. ప్రమాదంలో ఖాసీఫ్ మినహా మిగిలిన వారు మృతి చెందగా మరుసటిరోజు తుమ్మనంగుట్టలో నలుగురి అంత్యక్రియలు నిర్వహించారు. ఇదే తరహాలో రెండేళ్ల తర్వాత గవడిగలవారిపల్లె, కొత్తపల్లెకు చెందిన శాంతి కుమారి, లక్ష్మణ, చిన్న లక్ష్మమ్మ, విజయ్‌ప్రశాంత్‌లు గృహప్రవేశానికి వెళ్లిన నలుగురు విగత జీవులయ్యారు. వీరి అంత్య క్రియలు కూడా ఒకేసారి జరిగాయి.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

బి.కొత్తకోట : పెద్దతిప్పసముద్రం మండలం కానుగమాకులపల్లె విద్యుత్‌షాక్ ఘటనలో నలుగురు మృతి చెందగా గాయపడిన ముగ్గురి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎంపీ పీవీ.మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. శనివారం బి.కొత్తకోట మండలంలోని వడిగలవారిపల్లెకు చెందిన శాంతికుమారి, లక్ష్మణ, కొత్తపల్లెలోని చిన్న లక్ష్మమ్మ, విజయ్‌ప్రశాంత్ కుటుంబాలను పరామర్శించారు. డిస్కం, ప్రభుత్వం తరపున వేర్వేరుగా పరిహారం అందిస్తామని చెప్పారు. తొలుత డిస్కం తరపున మృతుల కుటుంబాలు ఒక్కొక్కరికి రూ.5లక్షలు, క్షతగాత్రులకు రూ.2 లక్షలు చొప్పున పరిహారాన్ని ఎంపీ, ఎమ్మెల్యే అందించారు. ఇదికాక ప్రమాద ఘటనను సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దష్టికి తీసుకెళ్లామని, ప్రభుత్వం తరపున మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి మరో రూ.5 లక్షలు, క్షతగాత్రులకు ఒక్కొక్కరికి రూ.లక్ష పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీ ఎమ్మెల్యే తెలిపారు.కార్యక్రమంలో డిస్కం ఎస్ఈ కృష్ణారెడ్డి, ఏఈ గిరిధర్, కురబలకోట ఎంపీపీ దస్తగిరి, జెడ్పీటీసీ రామచంద్ర, సింగిల్‌విండో చైర్మన్ అమరనాథ్, మాజీ ఎంపీపీ పాగొండ ఖలీల్, సర్పంచులు భీమిగాని నాగిరెడ్డి, సాంబశివ, రవికుమార్ రెడ్డి, చంద్ర, జయరామిరెడ్డి పాల్గొన్నారు.



చెక్కులు అందిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

దేశ చరిత్రలో 'జగనన్నే మా భవిష్యత్' రికార్డు

ఎంపీ మిథున్‌రెడ్డి

రాయచోటిటౌన్ : దేశ చరిత్రలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఒక రికార్డని లోక సభ ప్యానల్ స్పీకర్, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. శనివారం రాయచోటిలోని జెడ్పీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఇందులో వైఎస్సార్ సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మా నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి కేవలం రెండు పేజీల మేనిఫెస్టోను ప్రవేశపెట్టి మూడున్నరేళ్లలో 98 శాతానికి పైగా నెరవేర్చడం గొప్ప విషయమన్నారు.పీపుల్స్ సర్వే ఈనెల 7వ తేదీన ప్రారంభమై దిగ్విజయంగా సాగుతోందన్నారు. వారం రోజుల్లోనే 61 లక్షల కుటుంబాలకు చేరువయ్యారని చెప్పారు. 47 లక్షల మంది జగనన్నకు మద్దతుగా మిస్డ్ కాల్స్ ఇచ్చారంటే ప్రజలు జగనన్నకు ఎంత మద్దతు ఇస్తున్నారో అర్థం అవుతోందన్నారు. 175 స్థానాలు దక్కించుకొనేలక్ష్యంతో పార్టీ క్యాడర్ పని చేస్తోందని వివరించారు.



మాట్లాడుతున్న ఎంపీ, చిత్రంలో ఎమ్మెల్యేలు

- వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.2.5 కోట్ల నిధులు నేరుగా ప్రజల అందించిన ఘనత కేవలం సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు.
- బాబువి గోబెల్స్ ప్రచారాలు మాత్రమేనని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆరోపించారు.
- 2024లో జరిగే ఎన్నికల్లో మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి తథ్యమని మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్ బాష అన్నారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ అవుల విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర వైఎస్సార్ సీపీ కార్యదర్శి చిదంబరరెడ్డి, మదనపల్లె వైఎస్సార్ సీపీ పరిశీలకులు హబీబ్‌ఖాన్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు బేపారీ మహమ్మద్‌ఖాన్, రాష్ట్ర కార్యదర్శి వడ్డీ వెంకటరామిరెడ్డి, జానం రవీంద్రా యాదవ్, మున్నా, సర్పంచ్ దండు నాగభూషన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫ్లాష్.. ఫ్లాష్..

నెత్తురోడిన రహదారి

- కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం
- రెండు కార్లు ఢీ.. ముగ్గురి మృతి
- ఐదుగురికి తీవ్రగాయాలు



రోడ్డు ప్రమాద దృశ్యం

రామాపురం : కర్నూలు – చిత్తూరు 40వ జాతీయ రహదారి మార్గంలో అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం రామాపురం మండలం బీసీ కాలనీ సమీపంలో శనివారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు కార్లు ఎదురెదురుగా ఢీ కొన్న సంఘటనలో ముగ్గురు దుర్మరణం చెందారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు నెల్లూరు నుంచి రాయచోటి వైపు ఐదుగురు ప్రయాణికులతో వెళ్తున్న కారు రామాపురం మండలం బీసీ కాలనీ సమీపానికి రాగానే రాయచోటి నుంచి కడప వైపు వెళ్తున్న మరో కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో నెల్లూరుకు చెందిన ఒక మహిళతో పాటు మరో ఇద్దరు పురుషులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని తొలుత చికిత్స నిమిత్తం 108 వాహనంలో లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, కడపవైపు వెళ్తున్న కారులో ఉన్న డ్రైవర్, ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. వారు ముగ్గురితో పాటు తీవ్రంగా గాయపడిన నెల్లూరుకు చెందిన మరో మహిళను లక్కిరెడ్డిపల్లె నుంచి కడప రిమ్స్‌కు తరలించారు. ఈ ప్రమాదంలో మరొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. రామాపురం పోలీసులు కేసు నమోదు చేశారు.



మృతదేహాలు

మామిడి తోటలు దగ్ధం


కాలిపోయిన మామిడి చెట్టు

వీరబల్లి (రాయచోటి టౌన్) : అగ్నికి ఐదు ఎకరాలకు పైగా మామిడి తోటలు ఆహుతి అయ్యాయి. సుమారు ఏడు సంవత్సరాల వయసున్న మామిడి చెట్లు 100కు పైగా మంటల్లో కాలిపోయాయి. ఫైర్ స్టేషన్ అధికారి వెంకట్రామిరెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వీరబల్లి మండలం వంగిమళ్ల గ్రామంలో మాండవ్య నది ఒడ్డు సమీపంలో ఉన్న వై.రాముడు, వై.చిన్నప్పలకు చెందిన మామిడి తోటలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. రైతులకు ఈ విషయం తెలిసేలోపే తోటలకు వేసుకున్న కంచె దాటి లోపలికి మంటలు వచ్చాయి. విషయం ఫైర్ స్టేషన్ అధికారులకు తెలియజేయడంతో.. వారు వెంటనే వచ్చి ఆర్పే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే చాలా చెట్లు కాలిపోయాయి. సుమారు రూ.5 లక్షల నష్టం జరిగిందని బాధితులు వాపోయారు.

కాలిపోయిన గుడిసె

ములకలచెరువు : మండలంలోని సెంట్రల్ స్కూల్ పంచాయతీ పెద్దమొరవపల్లెలో శనివారం పూరిగుడిసె దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. నాగవేణికి చెందిన పూరిగుడిసెకు ప్రమాదవశాత్తు అగ్గి అంటుకొని మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అనంతరం స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోగా గుడిసె పూర్తిగా కాలిపోయింది. అందులోని డ్రిప్పు పరికరాలు, పైపులు బూడిదయ్యాయి. రూ.50 వేల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

● అయ్యో చిన్నారి

ఉయ్యాలే ఉరి తాడై..

చిన్నపిల్లలకు ఉయ్యాల ఊగడం మహా సరదా.
వేసవి కాలంలో బయటికి వెళ్లి ఆడుకోవాలంటే..
ఎండలు భగభగ మండుతున్నాయి. కావున
చాలా మంది నీడ పట్టున ఉయ్యాల ఊగుతుంటారు.
అలానే ఓ బాలిక ఇంట్లో చీరతో కట్టిన ఉయ్యాలలో
ఊగసాగింది. కానీ ఆ చిన్నారికి
ఏం తెలుసు.. అదే ఉరితాడు అవుతుందని..
తనకు తాను గుండ్రంగా తిరుగుతూ ఊయల ఊగింది.
అంతే చీర మెడకు చుట్టుకుని, ప్రాణం తీసేసింది.
ఈ విషాదకర సంఘటన అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె
నియోజకవర్గం కురబలకోట మండలం
నందిరెడ్డిగారిపల్లెలో శనివారం చోటుచేసుకుంది.


మృతి చెందిన తాహీరా

కురబలకోట : కురబలకోట మండలం నందిరెడ్డిగారిపల్లెకు చెందిన మహమ్మద్ ఆజం స్థానికంగా మదర్సా నిర్వహిస్తున్నారు. ఆయన కుమార్తె షేక్ తాహీరా స్థానికంగా ఉన్న యూపీ స్కూల్‌లో ఆరవ తరగతి చదువుతోంది. శనివారం మధ్యాహ్నం ఇంటికి వెళ్లిన తర్వాత.. అక్కడ చీరతో కట్టిన ఊయల ఊగసాగింది. తనకు తాను గుండ్రంగా తిరుగుతూ ఊగుతుండగా చీర మెడకు చుట్టుకుంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. తల్లిదండ్రులు బయటకు వెళ్లారు. మిగిలిన వారు మధ్యాహ్నం పక్కన ఇంటిలో నమాజ్‌లో ఉన్నారు. తర్వాత వచ్చి చూస్తే విద్యార్థిని స్పృహ కోల్పోయిన స్థితిలో ఉండటాన్ని గమనించారు. వెంటనే మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అంతకు ముందు వరకు సహ విద్యార్థులతో ఆడుతూ పాడుతూ తిరిగిన విద్యార్థిని ఆకస్మికంగా మృతి చెందడం పలువురిని తీవ్రంగా కలచివేసింది. కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. బంధువులు విషాదంలో మునిగిపోయారు.

ముగిసిన పది.. కొత్త ఉత్సాహంతో మది


ఉత్సాహంగా విజయసంకేతం చూపుతున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ : జిల్లా వ్యాప్తంగా విద్యా శాఖ నిర్వహించిన పదో తరగతి పరీక్షలు శనివారం ముగిశాయి. ఏడాది మొత్తం సరదాలకు దూరంగా ఉండి, పుస్తకాలతో గడిపిన వీరికి విరామం దొరికింది. జిల్లాలో 123 కేంద్రాల్లో 22,395 మంది పరీక్షలు రాశారు. ఏడాదంతా కష్టపడి చదివిన విద్యార్థులు తమ భవిష్యత్తుకు కీలకమైన పరీక్షలను ఓ దీక్షలా పూర్తి చేశారు. ఇన్నాళ్ల భయం, తీవ్ర ఒత్తిడితో ఉన్న వారు పరీక్షలు పూర్తయ్యాక ఉత్సాహంగా కనిపించారు. స్నేహితులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. ఒకింత ఆందోళనతో కేంద్రాలకు వచ్చిన వారు.. విజయ సంకేతం చూపుతూ సంతోషంగా ఇళ్ల బాట పట్టారు. మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో గురుకుల పాఠశాల విద్యార్థినులు మాట్లాడుతూ పరీక్షా కేంద్రంలో అన్ని ఏర్పాట్లు బాగా చేశారన్నారు. అన్ని సౌకర్యాలు కల్పించారని సంతోషం వ్యక్తం చేశారు. తాము పాఠశాల స్థాయి దాటేశామని, వచ్చే విద్యా సంవత్సరం జూనియర్ కళాశాలల్లో అడుగు పెడతామన్న ఊహల్లో తేలియాడారు. స్నేహితులు, సహ విద్యార్థులతో ఎంతో సరదాగా మాట్లాడారు. ఇంటర్మీడియెట్ ఎక్కడ చదువుతామో, మళ్లీ ఎన్నాళ్లకు కలుస్తామోనని మిత్రులకు భారంగా వీడ్కోలు పలికారు. వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులు తమ తల్లిదండ్రుల సాయంతో సామగ్రి, పుస్తకాల సంచులు పట్టుకుని సొంత ఊళ్లకు బయలుదేరారు.

థాంక్యూ యూటీఎఫ్ : పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ మోడల్ పరీక్షా పత్రాలను అందజేసింది. ఈ పరీక్షల్లో అధికంగా అవే ప్రశ్నలు రావడంతో శనివారం పదో తరగతి విద్యార్థులు థాంక్యూ యూటీఎఫ్ అంటూ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక నీరుగట్టువారిపల్లెలోని వివేకానంద మున్సిపల్ పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యుటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సుధాకర్‌నాయుడు, వెంకటరమణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ : ఒకరి దుర్మరణం


మృతి చెందిన వెంకటేష్


తీవ్రంగా గాయపడిన అజయ్

బి.కొత్తకోట : ఎదురుగా వస్తున్న ఆటోను లారీ ఢీకొనడంతో.. ఒకరు దుర్మరణం చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం బి.కొత్తకోట మండలం బి.కొత్తకోట–మదనపల్లె మార్గంలోని ఈడిగిపల్లె సమీపంలో జరిగింది. ఎస్ఐ రామ్మోహన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బి.కొత్తకోటలోని బీసీ కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ అజయ్ (22) శనివారం మదనపల్లె నుంచి బి.కొత్తకోటకు బయలుదేరాడు. అజయ్ పక్కన పెద్దతిప్పసముద్రం మండలం బెట్టకొండకు చెందిన మిత్రుడు వెంకటేష్ (24) కూర్చున్నాడు. ఆటోలో బి.కొత్తకోట దళితవాడకు చెందిన నరేష్ (20), దేగానిపల్లెకు చెందిన పృథ్వీ (20) ఉన్నారు. ఆటో హార్సిలీహిల్స్ క్రాస్ దాటుకొని వస్తుండగా.. బి.కొత్తకోట నుంచి మదనపల్లెకు చక్కెర లోడుతో వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్ పక్కన కూర్చున్న వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందగా, డ్రైవర్ అజయ్ తలకు బలమైన గాయాలు కావడంతో తీవ్ర రక్తస్రావమైంది. పరిస్థితి విషమంగా ఉండటంతో 108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలం చేరుకున్న ఎస్ఐ రామమోహన్.. తీవ్రంగా గాయపడిన పృథ్వీ, నరేష్‌ను పోలీసు జీపులో మదనపల్లెకు తరలించారు. అజయ్‌ను మెరుగైన వైద్యం కోసం మదనపల్లె నుంచి తిరుపతి రుయాకు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీస్‌స్టేషన్ తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వెలుగు సిబ్బందిపై కేసు

తొండూరు : తొండూరు మండలం గంగనపల్లె గ్రామంలో డ్వాక్రా మహిళల సొమ్ము స్వాహా చేసిన అధికారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతు శనివారం తెలిపారు. యానిమేటర్ హేనిమ దాదాపు రూ.30 లక్షల సొమ్ము ఇటీవల స్వాహా చేసిన సంఘటనలో పోలీసులు విచారణ చేపట్టారు. ఇందుకు సంబంధించి వెలుగు సీసీ గంగాధర, యానిమేటర్ హేనిమపై కేసు నమోదు చేశారు.

మినీ టెంపో ఢీకొని వ్యక్తి మృతి

మదనపల్లె : మినీ టెంపో ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పట్టణంలోని శేషప్పతోటకు చెందిన నారాయణ (40) పుంగనూరు రోడ్డులో ఓ పాలడెయిరీలో ల్యాబ్‌టెక్నీషియన్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ద్విచక్రవాహనంలో విధులకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న మినీటెంపో ఢీకొంది. ఈ ప్రమాదంలో నారాయణ తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా మారడంతో బెంగళూరుకు రెఫర్ చేశారు. అక్కడికి తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు.

సిద్ధార్థలో వర్చూసా సెంటర్ ప్రారంభం


వర్చూసా సావనీర్‌ను విడుదల చేస్తున్న అశోకరాజు, కృష్ణ త్యాగరాజన్

నారాయణవనం(తిరుపతి జిల్లా): పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలల్లో శనివారం బెంగళూరుకు చెందిన ప్రముఖ వర్చూసా సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించారు. ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ అశోకరాజు, వర్చూసా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ త్యాగరాజన్ కేంద్రాన్ని ప్రారంభించి సావనీర్‌ను విడుదల చేశారు. అనంతరం కృష్ణ త్యాగరాజన్ మాట్లాడుతూ సిద్ధార్థలో మెరుగైన వసతులు అందుబాటులో ఉన్నాయని, త్వరలో రెండో సెంటర్‌ను ప్రారంభిస్తామని అన్నారు. వర్చూసా సెంటర్ల ద్వారా ఇంజినీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులు అప్‌డేటడ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందే అవకాశం ఉంటుందన్నారు. అశోకరాజు మాట్లాడుతూ మెరుగైన స్థాయిలో ప్లేస్‌మెంట్లు పొందడానికి ఈ కేంద్రాలు దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జనార్ధనరాజు, ప్లేస్‌మెంట్ అధికారులు మణిమోహన్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఐపీఎస్ సుమతి

రాజంపేట రూరల్ : విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఐపీఎస్ బి.సుమతి తెలిపారు. మండల పరిధిలోని తాళ్లపాక సమీపంలో ఉన్న శాన్వి ఇంటర్ నేషనల్ స్కూల్‌లో శనివారం సీబీఎస్‌సీ వార్షికోత్సవ వేడుకలను కరస్పాండెంట్ కొండూరు శరత్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐపీఎస్ బి.సుమతి మాట్లాడుతూ కరోనా వంటి క్లిష్ట పరిస్థితులలో కూడా విద్యాసంస్థలను విజయవంతంగా కొనసాగించిన శరత్‌కుమార్‌రాజు ఆదర్శవంతుడని కొనియాడారు. అనంతరం సీబీఎస్‌సీ 10వ తరగతి ఫలితాలలో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు, డైరెక్టర్ భరత్‌కుమార్‌రాజు, సీఈఓ శంకర్‌రాజు, ప్రిన్సిపల్ విజయనిర్మల, బీబీయస్ ప్రిన్సిపల్ రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగ్గురిపై దాడి


చికిత్స పొందుతున్న రెడ్డెమ్మ

కలకడ : ముగ్గురిపై దాడి చేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ బాలక్రిష్ణ తెలిపారు. ఏఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ గరడప్పగారిపల్లె గ్రామానికి చెందిన రెడ్డెమ్మ, రాజేశ్వరి, శ్రీనివాసులుపై కె.బాటవారిపల్లె పంచాయతీ బీసీ కాలనీకి చెందిన వెంకటరమణ (ఉపాధ్యాయుడు), గరడప్పగారిపల్లెకు చెందిన రెడ్డిరాజేష్, ప్రకాష్, సాయి, కొత్తగాండ్లపల్లెకు చెందిన యజ్ఞశాలయ్య, బాలయ్యగారిపల్లె పంచాయతీ నల్లగుట్టపల్లెకు చెందిన కె.బాలాజీ కలిసి గురువారం దాడి చేశారు. వారిలో గాయపడిన రెడ్డెమ్మను పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన శనివారం కురబలకోట మండలంలో జరిగింది. మండలంలోని ముట్టివారిపల్లె పంచాయతీ జబ్బవారిపల్లెకు చెందిన నరసింహారెడ్డి కుమారుడు ఎస్.శివశంకర్‌రెడ్డి (29) బెంగళూరులో ఓ కంపెనీలో పని చేస్తూ జీవిస్తున్నాడు. ఆయన భార్య కుటుంబ సమస్యల కారణంగా గొడవ పడి పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమెను కాపురానికి రావాల్సిందిగా శివశంకర్‌రెడ్డి కోరాడు. భార్య నిరాకరించడంతో మనస్తాపానికి గురై ఇంటికి వచ్చి పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ల చోరీపై కేసు నమోదు

మదనపల్లె : మదనపల్లె మండలం, పట్టణంలో ఇటీవల తొమ్మిది బైక్‌లు చోరీకి గురయ్యాయని బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ మురళీకృష్ణ, తాలూకా సీఐ సత్యనారాయణలు తెలిపారు. మదనపల్లె టూటౌన్‌పోలీస్‌స్టేషన్ పరిధిలో మహమ్మద్ షరీపుల్లా, సయ్యద్‌బీన్, వీరాంజనేయులు, జిలానీబాషా, రెడ్డికుమార్, యాసిన్‌బాషా, మస్తాన్‌లకు చెందిన ద్విచక్రవాహనాలు చోరీకి గురికాగా కేసు నమోదు చేశామన్నారు. అదే విధంగా మండలంలోని సీటీఎంకు చెందిన గోపాల్, రెడ్డిశేఖరలకు చెందిన ద్విచక్రవాహనాలు చోరీకి గురికాగా తాలూకా పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వరుస ద్విచక్రవాహనాల చోరీలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కారులో మంటలు


కాలిపోయిన కారు ఇంజన్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ప్రొద్దుటూరు : అనుకోకుండా కారులో మంటలు చెలరేగాయి. లోపల తల్లీబిడ్డ ఉన్నారు. వెంటనే మున్సిపల్ సిబ్బంది మంటలను అదుపు చేయడంతో ప్రమాదం త్రుటిలో తప్పింది. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా కదిరి పట్టణానికి చెందిన శ్రీకాంత్ తన భార్యతోపాటు చంటిబిడ్డను తీసుకుని కారులో ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. మున్సిపల్ కార్యాలయంలో బర్త్ సర్టిఫికెట్ కోసం వారు ఇక్కడికి వచ్చారు. శనివారం ఉదయమే కదిరిలో బయల్దేరిన వీరు మధ్యాహ్నం ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. శ్రీకాంత్ మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లగా చంటిబిడ్డతో ఆయన సతీమణి ఏసీ వేసుకుని కారులో నిద్రపోయారు. ఉన్నట్టుండి కారు ఇంజన్‌లో పొగలు వచ్చాయి. 15–20 నిమిషాలకు దట్టమైన పొగలు రావడంతో అక్కడే ఉన్న మున్సిపల్ సిబ్బంది కారులో ఉన్న ఆమెను నిద్ర లేపి కిందికి దించారు. మున్సిపల్ ఏఈ దస్తగిరిరెడ్డి మోటార్ ఆన్ చేసి సిబ్బంది ద్వారా క్యాన్లతో మంటలను ఆర్పివేశారు. లోపలికి వెళ్లిన శ్రీకాంత్ బయటికి వచ్చి చూసి ఆశ్చర్యపోయాడు. ఇంజన్‌లోని బ్యాటరీ వేడికి షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇలా జరిగిందని, ఇంకా కొద్దిసేపు ఆలస్యం జరిగి ఉంటే కారు అద్దాలు కూడా సీజ్ అయ్యేవని పక్కనున్న డ్రైవర్లు తెలిపారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది సాయంతో కారును షెడ్డుకు చేర్చారు.

మానవత్వం మరిచాడు..!

మృతదేహాన్ని దించేసి వెళ్లిన డ్రైవర్


భర్త మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య శివలక్ష్మి

ఆత్మకూరు రూరల్ (మర్రిపాడు): వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఓ వ్యక్తి నెల్లూరులోని ఆస్పత్రికి వెళ్లి తిరిగి స్వస్థలానికి టాక్సీలో వెళ్తుండగా, మర్రిపాడు వద్ద గుండెపోటు వచ్చి మృతి చెందాడు. మానవత్వాన్ని మరచిన టాక్సీ డ్రైవర్.. మృతదేహాన్ని తాను తీసుకువెళ్లబోనని మర్రిపాడులోనే రోడ్డు పక్కన దింపేసి వెళ్లిపోయాడు. దిక్కుతోచక రోడ్డు పక్కన టవల్‌పై భర్త మృతదేహాన్ని ఉంచి భార్య రోదిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అంబులెన్స్ ఏర్పాటు చేసి మృతదేహాన్ని ప్రొద్దుటూరుకు పంపించారు. ప్రొద్దుటూరుకు చెందిన ఆదినారాయణ (46) ఆరు నెలల కిందట నెల్లూరులోని కిమ్స్ ఆస్పత్రిలో గుండెకు ఆపరేషన్ చేయించుకున్నారు. వైద్య పరీక్షల కోసం ఆయన తన భార్య శివలక్ష్మితో కలిసి శనివారం నెల్లూరుకు వచ్చారు. వైద్య పరీక్షల అనంతరం ప్రొద్దుటూరుకు టాక్సీలో బయలుదేరారు. మార్గంమధ్యలో మర్రిపాడు వద్దకు చేరుకోగానే ఆదినారాయణకు గుండెపోటు వచ్చి మృతి చెందాడు. నెల్లూరు నుంచి కిరాయికి వచ్చిన టాక్సీ డ్రైవర్ తన వాహనంలో మృతదేహాన్ని తీసుకువెళ్లబోనని మర్రిపాడు బస్టాండ్ సెంటర్‌లోనే దించేసి వెళ్లిపోయాడు. శివలక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపించింది. ఈ విషయం తెలుసుకున్న మర్రిపాడు ఏఎస్ఐ శ్రీనివాసులురెడ్డి తమ సిబ్బందితో వచ్చి వివరాలు సేకరించి తక్షణమే అంబులెన్స్ మాట్లాడి మృతదేహాన్ని ప్రొద్దుటూరుకు పంపించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలో ఉన్న కడప– చెన్నై జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపిన వివరాల మేరకు... రాజంపేట మండలం వెంకటరాజంపేట గ్రామానికి చెందిన రంగయ్య(60), సుధాకర్(55) కారులో కడప నుంచి రాజంపేటకు బయలుదేరారు. మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలో గల జాతీయ రహదారి వద్దకు రాగానే వేగాన్ని అదుపు చేయలేకపోవడంతో.. రోడ్డు పక్కన ఉన్న చెట్టును కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి రక్త గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న ఒంటిమిట్ట పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ప్రథమ చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలనికి తీసుకొచ్చారు. పోలీసులు కేసు నమోదు చేశారు.